# జాతకప్రభావం

'రాజా'

నాగేంద్రంధరించేట్వీడుసూట్లూ, నున్నగాదువ్వుకున్న జుట్టూ, నిమిషనిమిషానికీ తనఅందం ఏమన్నా చెరిగిపోతుందేమో అన్నట్టు తడుముకుంటూ ఉండే అతని వాలకం, చూస్తే అతనికింకా పెళ్ళి కాలేదని ఊహించడానికి అట్టేకాలం పట్టదు.

ఈ నాగేంద్రాన్ని కలుసుకోడం, అతనితో మాట్లాడడం మాకుచాలా సరదాగా ఉండేది. ఒక రోజున మేం మెరీనా క్యాంటీన్‌లో ఐస్‌క్రీమ్ పుచ్చుకుంటున్నప్పుడు అతని మొహంలో ఏదో ఒకకళా, ఏదోసంతోషం ఉన్నట్టు గమనించాను. అతని సంతోషానికి కారణం నేను ఊహించలేకపోయాను.

నాగేంద్రం చాలా దూబరామనిషి. అతనికి స్థిరాస్తి ఏమీ మిగల్లేదు. అంతా డబ్బుకింద మార్చేశాడు దాంతో ఒక మేడొకటికొన్నాడు తతిమ్మాదంతా అతను మంచి పీళ్ళల్లా ఖర్చుపెట్టేసేవాడు. అతను ఖర్చుపెట్టే విధంచూస్తే అది అట్టేకాలం నిలిచేట్టు కనిపించలేదు. అతన్ని చూస్తూనే ఈ సంగతులన్నీ మెదిలాయి నా మనస్సులో.

"ఏమిటోయ్, నాగేంద్రం? చాలా ఉత్సాహంగా ఉన్నట్లున్నావ్, ఈ వాళ?"

"నిజం?"

"కాక! ఏమిటి సంగతి?"

అతను తన వెండి సిగరెట్ కేస్ తీసి, అందులోంచి ఖరీదైన సిగరెట్టొకటి నాకిచ్చి, మరొకటి అతను పుచ్చుకుని పొగ ఉంగరాలుగా వదుల్తూ, "సరేగాని, నీకు కర్మమీద నమ్మకం ఉందీ?" అన్నాడు.

"అప్పుడప్పుడు" అన్నాను. ఏమంటేమనకి కష్టాలొచ్చినప్పుడు మట్టుకు 'కర్మ' అనుకొంటూంటాంగా!

"కొందరు మనుషులు పుట్టడంతోటే డబ్బుతో పుడతారు. కొందరు గర్భదరిద్రులుగా ఉంటారు. దీనికి కారణం ఏదోచెప్పగలవా?" అన్నాడు.

వీడికి కర్మలో నమ్మకం లేదంటే ఏడుస్తాడని చెప్పి, "ఇదంతా పురాకృత కర్మానుసారంగా ఏర్పడుతుందేమో!" అన్నాను.

వాడిల్లా అడగడానికికారణం కర్మకీ, వాడిసంతోషానికీ ఏదోసంబంధం ఉండిఉంటుందనుకున్నాను.

అనుకున్నట్టేవాడు, "నాకీమధ్యనే ఒకజాతకుడు చెప్పాడు. నేను ఆరునెల్లలోపుల ఎంతో డబ్బున్నటువంటిదీ, ఎంతోఅద్భుత సౌందర్యం గలిగినటువంటిదీ ఒక అమ్మాయిని చేసుకుంటానట"

"దాంతర్వాత నా జీవితంలో కాగడా పుచ్చుకు వెదికినా కష్టాలనేవే కనిపించవుట." అన్నాడు.

వాడు నిష్కారణంగా ఏదోజాతకుడు చెప్పాడనిచెప్పి, గాలిమేడలు కట్టుకుని, ఎప్పుడో సిరి వస్తుందని యిప్పటినించే డబ్బంతా గుల్ల చేసుకుంటున్నాడని చెప్పి వినేసరికి నాకు గంపెడు ఆశ్చర్యమూ, సానుభూతీ కలిగాయి.

నేను వెంటనే, "నాగేంద్రం, యిది నిజంగానే జరుగుతుందని అనుకుంటున్నావా?" అని అడిగాను.

"ఏం, అందులో సందేహమేముంది?" అన్నాడు. పెళ్లాం కాపరానికి రావడంతోనే సిరి యెత్తుకున్న యిద్దరు ముగ్గురి కథల్ని వర్ణించి చెప్పాడు.

మేం హోటలుబయటికి వచ్చాం. నేను బస్సులోపోతానని బయలుదేరుతూంటే వాడు నన్నాపి, "నువ్వు నాకార్లో వస్తేనేగాని వీల్లేదు ఒకసారి మాయింటికిరా. ఒక్కసారి కూడా రాలేదునువ్వు" అని బలవంతంచేసి తనకార్లో పదినిమిషాల్లో మైలాపూర్లో అతని యింటికి తీసికెళ్ళాడు. అది ఒక పెద్దమేడ, యింటినిండా చాలా ఖరీదైన ఫర్నిచరు ఉంది. విశాలంగా ఒక పడకగది, అందులో రెండుమంచాలూ- వాటిమీద మల్లెపూలల్లా తెల్లగా ఉన్న దుప్పట్లూ; అందులో ఒక మూల ఒకటేబిల్; దానిమీద రెండుఫ్రేములు ఒక దానిప్రక్క మరొకటి, ఒకదాంట్లో నాగేంద్రం ఫొటో, రెండోది ఖాళీగా పెట్టివుంది. బహుశా అది ఆతని కాబోయే భార్యకోసరం కాబోలు:

తర్వాత టాయిలెట్‌గది, రెండుకొళాయిలు, వాటిక్రింద రెండుబేసిన్లు, రెండుడ్రసింగ్ టేబిల్సు ఒకటి మొగాళ్ళ డ్రసింగ్ టేబిల్ కాబోలు దాని మీద పాండ్సు కోల్డుక్రీమ్, వ్యానిషింగ్ క్రీమ్ ఉన్నాయి. రెండోదానిమీద బ్రైల్‌క్రీమ్ లిప్‌స్టిక్ తలపిన్నులూ, కాటికడబ్బా, చిన్న బొట్టుపెట్టుకునే ఆయుధం. గోళ్ళకోసం కుటెక్సూయింకాఎన్నెన్నో లెక్కలేనన్ని. దానికొకప్రక్క లేడీస్ హ్యాండ్ బ్యాగ్ కూడా ఉంది.

రెండుస్టాండులో మూల; ఒకదానిమీద గ్లాస్కో పంచలు, గ్లాస్కోజుబ్బాలూ. రెండోదానిమీద మంచి ఖరీదైన చీరలూ జాకెట్లూ అన్నీనూ.

తర్వాత హాలిట్లోకి వెళ్ళాను. రేడియో, సోఫాలూ మహాజోరుగా ఉన్నాయి ఈ హంగామా అంతాచూస్తే అందులో ఒకసంసారం ఉంటోందా అనిపిస్తుంది. బహుశా నాగేంద్రంగాని మరొక యువతితో ఎవరితోనన్నా యిక్కడ ఉంటున్నాడా అని నాకు అనుమానం వేసింది.

వాడు వెంటనే నా అనుమానం గ్రహించి నట్టున్నాడు. వెంటనే "నీఅనుమానం నాకు తెలుసు. నే నల్లాంటివాణ్ణని నువ్వు కల్లోనయినా అనుమానించ నక్కర్లేదు. కానినేను నిరీక్షిస్తాను. ఆరునెలల్లో ఆమెవస్తుంది తప్పకవస్తుంది. అందులో నీకేమీ సందేహం అక్కర్లేదు." అన్నాడు.

"దానికేంలే, నీపనిమాటేమిటి? ఏమన్నా ఉద్యోగంచేస్తావా ఏమిటి?" అనిఅడిగాను.

"నేను పూర్తిగా ఈజాతకం మీదేఆధారపడి ఉన్నాను. నాభూములన్నీ అమ్మాను, ఈ మేడ కొన్నాను, కారుకొన్నాను, టెలిఫోను తెప్పించాను, ఈ ఊళ్ళోవున్న క్లబ్బులన్నింట్లోనూ మెంబర్నే. ఏనాడో ఎక్కడో ఆఅమ్మాయి పరిచయం అవుతుంది ఇంకనాతిండిసంగతంటావా, శుభ్రంగా తింటాను, ఖరీదైనబట్టలు రాజాలాగ వేసుకుంటాను ఇంతకంటె యింకేం కావాలి?"

"ఈలెక్కని నీడబ్బు ఎంతకాలంవస్తుంది?"

"ఒకటీ రెండేళ్ళొస్తుంది మహావస్తే"

"తరవాత?"

"జాతకప్రభావం!"

"ఎందుకుచెప్పు ఈ దండుగంతా. ఒక్కడికి ఎందుకింత పెద్దమేడ? ఒంటిగాడిలాపోక, ఎందుకొచ్చిన కార్లూ గీర్లూ?"

"మిష్టర్, యింతహంగామా లేకపోతే అధవంతులబిడ్డ, అ సుగుణాలరాసి, అ సౌందర్య తిలక తేరగా వస్తుందటోయ్?"

నేను వాడిపిచ్చినమ్మకం చూసి జాలిపడ్డాను. వెంటనే యిహఅక్కడ ఉండకుండా వెంటనే వచ్చేశాను.

నెల్లాళ్ళదాకా మళ్ళామేమిద్దరం కలుసుకోలేదు ఒకరోజున బీచిదగ్గిర తారసపడ్డాడు నాగేంద్రం చిరునవ్వుతో.

"జాతకం నిజమైంది!" అన్నాడునిజ'యోత్సాహంతో.

నేనుఆదిఊరికే అన్నాడనుకుని, "కలలోనా" అన్నాను.

వాడువెంటనే, "మీలాంటి నమ్మకంలేనివాళ్ళకి చెప్పడానికి వీల్లేదు. రేపు ప్రత్యక్షంగానే చూద్దువుగానిలే. సాయంత్రం అయిదున్నరకల్లా మెరినా రెస్టారెంటుకి ఎదురుగా ఉండు. నిజమో, అబద్ధమో నీకే తెలుస్తుందిలే." అనిచెప్పి వెళ్ళిపోయాడు.

మర్నాడు వాడు చెప్పినటయిముకి మెరీనాలో హాజరయ్యాను. యింతట్లోవాడు చాలా అందమైన అమ్మాయినొకదాన్ని చెయ్యిపుచ్చుకుని తీసుక వస్తున్నాడు. నన్ను చూసి, "దా, కాంటీన్ కెడదాం" అన్నాడు విజయగర్వంతో నవ్వుతూ.

మేం డాబామీదెక్కి ఒక టేబిల్ దగ్గర చుట్టూ కూర్చున్నాం మరొకప్పుడయితే నాదృష్టి దూరంగా పొంగిపోస్తోన్న సముద్రపు అలలమీద ఉండేది. కాని ఈవాళ నాదృష్టి అంతా ఆ అమ్మాయిమీదే ఉంది. ఆమెకట్టిన జార్జెట్ సిల్కు చీరా మెళ్లో డైమెండ్ నెక్ లేసూ తళుక్ తళుక్కుని మెరుస్తోంచే యింకా ఆమె ధనికుల బిడ్డకాదని ఎలా అనుకోగలను? జాతకుడు నిజమే చెప్పాడు తెల్లటిమొహంలో నల్లటి అకళ్ళు - నిజంగా జాతకుడు చెప్పినట్టు స్వర్గంలోంచే ఊడిపడిందా అన్నట్టుగా ఉంది.

నాగేంద్రం 'టోమాటో భాత్' ఆర్డరిచ్చాడు. మరొకప్పుడయినట్టయితే ప్లేటుప్లేటంతా ఒక్క క్షణంలో ఊడ్చేవాణ్ణే. కాని నేనింతకుముందు అతన్ని అనవసరంగా అనుమానించానే అని పశ్చాత్తాప పడ్డం మొదలెట్టాను. నాగేంద్రం నేననుకున్నట్టు తెలివితక్కువ వాడుకాదు; ఇప్పుడు నేనే తెలివితక్కువ వాణ్ణిఅయ్యాను

ఆమె డికాక్షన్ ను కప్పులో పోస్తూ, మెరుస్తోన్న కళ్ళతో అడిగింది, "అయితే మీరు మా నాగేంద్రంగారికి స్నేహితులన్నమాట."

'యిన్నాళ్ళనించీ నాస్నేహితుడు నాగేంద్రం, ఒక రోజు పరిచయానికే ఆమెకి 'మానాగేంద్రం' అయిపోయాడే అని చాలా ఆశ్చర్యపడ్డాను. అవునన్నట్టు తలఊపాను.

సముద్రంమీంచి చల్లటిగాలి వస్తోంది. ఆమె ఓరకంట నాగేంద్రాన్ని చూసింది. బహుశా ప్రథమ వీక్షణంలో ప్రణయంఅంటే యిదే కాబోలునను కున్నాను. అయితే ఈప్రథమ వీక్షణం ఎలా కలిగిందోనన్న అనుమానమే నన్ను బాధిస్తోంది.

ఆమె బహుశా నాసందేహాల్ని నామొహంలో చదివినట్టుచూసి, "మాయిద్దరికీ పరిచయం ఎలా కలిగిందో మీకు తెలుసుకోవాలని ఉందా?" అని అడిగింది.

నేను "అవశ్యంగా" అని వింటున్నాను.

"పదింటికి బస్సుల్లో ఎంతరష్గా ఉంటుందో మీకు తెలుసుగా! నిన్న నేను గంటలతరబడి అలానే నించున్నాను గాని ఒకబస్సూ ఆగదు. తిన్నగా వెళ్ళిపోవడమే స్టాపులదగ్గిర నిలుచు కోకుండా. అలా యెంతసేపు నిలబడ్డానో, చివరికి ... (సిగ్గుపడుతూ) వీరు నాకులిఫ్ట్ ఇచ్చారు. అలాగ యేర్పడింది పరిచయం."

"తరవాత నేను వీరింటికి వెళ్లాను. అబ్బ! ఎంతపెద్దమేడ! ఎంతమంచి ఫర్నిచరూ........

"ఆయన మీకోసం ఎంతకాలంనించో కాచుకుకూర్చున్నారు తెలుసా?" అన్నాను.

"ఆ? నాకోసమా? ఎలాగ?"

"నేను చాలా పొరబడ్డాను. అతనేదో తెలివి తక్కువవాడనుకొన్నాను."

"నాకు బోధపట్టంలేదు మీరుచెప్పేది"

"మీకు నాగేంద్రం ఇంకాచెప్పలేదూ, దాన్ని గురించి?"

"లేదు."

నేను వెంటనే నాగేంద్రంకేసిచూసి, "మంచి వాడివే యింకా చెప్పలేదూ?" అన్నా.

ఆమె సందేహంగా నన్నుచూసి, "ఏమిటి దంతా? మీరు నన్నేమన్నా మోసంచేద్దామని చూస్తున్నారా ఏమిటి?" అంది.

"మేం నిజాయతీమనుషులమని మామొహాలు చూస్తే మీకు తెలియటంలేదూ?"

" అవ్వే, సాధారణంగా మంచిమోసాలూ, దగాలూ చేసేవాళ్లే పైకి చాలామంచివాళ్లల్లా కని పిస్తారు. " అంది నవ్వుతో.

నేను అతనిచరిత్రంతా పూసగ్రుచ్చినట్టుచెప్పా ను. చివరికి అతనికిఅభివందనాలు సమర్పించాను. నాగేంద్రం నానోట పొగడ్తవిని గర్వంగానకిలిం చాడు

ఆమె అనందంగా, " నిజం? నేను ముందర ఆజాతకుడెవరో చూసి అతన్ని బహూకరించాలి, దేవాంతకుడులా ఉన్నాడే! అన్నిరాళ్ళే ఉంటా యా?ఎక్కడో రత్నం ఉండకమానదు. " అంది, తన డైమండ్ నెక్ లేస్ సవరించుకొంటూ.

వారంఅయ్యాక మళ్లీచూశాను నాగేంద్రాన్ని. నన్ను చూస్తూనే వాడు ఎగిరి, " ప్రపంచంలో ఎక్కువ సంతోషంగా ఉన్నవాణ్ణి నేనే " అని నన్ను కౌగిలించుకున్నాడు. వాడి సంతోషంచూసి నాకు ఈర్ష్యవేసింది.

" మేం నాలుగయిదురోజుల్లో పెళ్లి చేసుకో బోతున్నాం. " అన్నాడు.

" అహాఁ, అలాగా, మంచిది. " అన్నాను.

" నువ్వోసారి వచ్చావంటే నిన్ను ఆమెఅన్న గారికి పరిచయం చేస్తాను " అన్నాడు.

నేను వాడిదగ్గిరనించి వచ్చాను యింటికి. ఎం దుకూ నాకు ఆమె అన్నతో పరిచయం? ఆమెకి ఒకచెల్లెలుంది. ఆమెతో పరిచయం చెయ్యరాదూ? అనుకున్నా.

మళ్లానెల్లాళ్లదాకా నాగేంద్రం కనిపించనేలేదు. వాడిపాటికి పెళ్ళిచేసుకుని కాపరంచేస్తూఉంటాడు. ఆడైమండ్ నెక్ లేస్ రాణిముందు మనమెక్కడ కనిపిస్తాం?

కాని నామేనస్సు ఉండబట్టలేదు. వాణ్ణీ, ఆమెనీ చూద్దామనిపించింది. సరేనని వాడిమేడదగ్గిరికి వెళ్ళాను. దానిమీద 'నాగేంద్ర' అన్న నేమ్ ప్లేట్ లేదు. నాకాశ్చర్యంవేసింది. ఏమన్నా పొర పాటు పడ్డానేమోనని మళ్ళా ఆమేడకేసిచూశాను. అదేమేడ. బహుశా నేమ్ప్లేటు రిపేరుకిచ్చి ఉంటాడు. నేను తలుపుతట్టాను.

కాస్సేపటిలో ఆమెవచ్చి తలుపుతీసింది.

" హల్లో. మానాగేంద్రం ఉన్నాడా? " అన్నా నవ్వుతూ.

" ఎవడివి నువ్వు? నాగేంద్రం ఎవరు? నేనెర గను. '' అని తలుపు థడేలుమని వేసుకుంది.

నాచిరునవ్వు పెదవుల్లోనే మాయమైంది. తెల్ల బోతూ, బుర్ర గోక్కుంటూ యింటికి వచ్చాను.

తరవాత రెండు మూడురోజులకి నాగేంద్రం మాయింటికి వచ్చాడు. చింపిరిజుట్టూ, చిరుగు చొక్కామా. అనమాలే పట్టలేక పోయాను. బహుశా అతనికేమన్నా పిచ్చెక్కిందా ఏమిటి అనుకున్నాను.

" ఏమిటిది నాగేంద్రం? "

" ఏంచెప్పను? ఆదొక దగాకోరు. పెళ్లి చేసు కుందామనిచెప్పి, యిల్లుతనపేర రాయించుకుంది; అంతే; ఉన్నదున్నట్టు తరిమేసింది. " అనిచెప్పి భోరున ఏడ్వటం మొదలెట్టాడు.

" నేనామెతో ప్రేమలోపడితే, ఆమె నాబంగా శామీద ప్రేమలో పడింది. ఆమెఅన్న అని చెప్పిన వాడు ఆమెభర్తట! నాధోరణి కనిపెట్టి యిలా దగాచేశారు. " అనిచెప్పుతుని ఏడ్చాడు.

" సాధారణంగా మంచిమోసాలూ, దగాలూ చేసేవాళ్లే పైకిచాలామంచి వాళ్ళలాకనిపిస్తారు. " అన్న ఆమెమాటలు నాచెవుల్లోగింగురుమన్నాయ్.

